క్లుప్తంగా

కలెక్టర్‌కు సన్మానం



జనగామ రూరల్: 2024లో నిర్వహించిన నేషనల్ అచీవ్‌మెంట్ సర్వేలో జిల్లా కీర్తిని జాతీయ స్థాయిలో నిలిపిన కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేశ్ కుమార్‌ను ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా శనివారం హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర కార్యదర్శి బుర్ర రమేశ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఆయనను శాలువాతో సన్మానించారు. గుండు మంజుల, పొట్టబత్తిని భాస్కర్, తాళ్లపల్లి లక్ష్మణ్, శ్రీనివాస్, రవికుమార్, శ్రీధర్ పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మొగుళ్ల



జనగామ: టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్‌ను ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, హెచ్‌డబ్ల్యూడబ్ల్యూ, ఎస్‌కేయూ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి శనివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

ఎన్నిక


ఉమాపతి


అశోక్

జనగామ రూరల్: జిల్లా కేంద్రంలో గాయత్రి ఫంక్షన్ హాల్‌లో శనివారం కల్లుగీత కార్మిక సంఘం జనగామ మండల మహాసభ మండల కార్యదర్శి మార్క ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సభలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కుర్ర ఉప్పలయ్య, బాల్నే వెంకట మల్లయ్య ఆధ్వర్యంలో నూతన మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బాల్నే ఉమాపతి, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలో కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

వ్యాసరచన పోటీలు



జనగామ: పట్టణంలోని నెహ్రూపార్కు సెయింట్ పాల్స్ స్కూల్‌లో లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ 69వ వార్షికోత్సవం పురస్కరించుకుని శనివారం విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. పోటీల్లో సెయింట్ పాల్స్‌కు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచినట్లు ప్రిన్సిపాల్ మరియ జోసఫ్ తెలిపారు. వ్యాసరచన పోటీల్లో భాను ప్రియ (10వ, ప్రథమ), అక్షయ (8వ, ద్వితీయ), చిత్ర లేఖనంలో నిమ్రా (5వ, ప్రథమ), అన్విత (3వ, ద్వితీయ)లకు బహుమతలను అందించారు.

వార కల్యాణం

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి సన్నిధిలో అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేదమంత్రాల నడుమ శనివారం స్వామివారి వారకల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు–కిరణ్మయి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలి



స్టేషన్‌ఘన్‌పూర్/జఫర్‌గఢ్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సంబంధిత అధికారులు, పాలకులు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాపర్తి రాజు డిమాండ్ చేశారు. శనివారం స్టేషన్‌ఘన్‌పూర్, జఫర్‌గఢ్ మండలాల్లోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలను కాలనీల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రెయినేజీలు అధ్వానంగా ఉన్నాయని, మురుగునీరు రోడ్లపై నిలుస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అపరిశుభ్ర డ్రెయినేజీ, పారిశుద్ధ్య సమస్యతో ప్రజలు రోగాలబారిన పడుతున్నారని తెలిపారు. అదే విధంగా పలు కాలనీల్లో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, తేలికపాటి వర్షాలకే బురదమయంగా మారుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు, పాలకులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మునిగెల రమేష్, ఇర్రి అహల్య, కొడెపాక యాకయ్య, రాయపురం భిక్షపతి, సకినాల కొమరన్న, శాగ యాదగిరి ఉన్నారు.

అసంపూర్తి బ్రిడ్జితో నిత్యం ప్రమాదాలు

- వాగులో పడిపోతున్న వాహనాలు
- జనగామ–హుస్నాబాద్ రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు


గానుగుపహాడ్ వద్ద నిలిచిన బ్రిడ్జి పనులు


వాగులో బోల్తా పడిన లారీ (ఫైల్)


బురదమయంగా మారిన తాత్కాలిక రోడ్డు

జనగామ రూరల్: మూడేళ్ల క్రితం భారీ వర్షాలకు జనగామ–హుస్నాబాద్ రహదారిలోని వడ్లకొండ వద్ద నిర్మించిన బ్రిడ్జి కూలిపోయింది. దీంతో అప్పటి నుంచి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాగా, గత ప్రభుత్వం హయంలో బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. బ్రిడ్జి మంజూరు అయిన వెంటనే కాంట్రాక్టర్ పనులను ప్రారంభించి నిధులు విడుదల కాకపోవడంతో పిల్లర్ల వరకు వేసి వదిలేశారు. దీంతో రాకపోకలకోసం గతంలో తాత్కాలికంగా రోడ్డు నిర్మించారు. గత ఏడాది కురిసిన భారీ వర్షాలకు రహదారి కోట్టుకుపోవడంతో కంకర, మట్టితో మళ్లీ రోడ్డు వేశారు. రోడ్డు సరిగా లేకపోవడంతో వర్షాలకు బురదమయంగా మారి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మార్చి నెలలో ప్రయాణికుల కష్టాలు చూడలేక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి పెండింగ్ పనులు పూర్తి చేయాలని కోరారు. వారంలో పెండింగ్ బిల్లుల మంజూరుతో పాటు పనులు చేపడుతామన్నప్పటికీ నేటికి ప్రారంభం కాలేదు. దీంతో మళ్లీ ప్రజలకు కష్టాలు తప్పలేదు. నిత్యం వందల సంఖ్యలో జనగామ నుంచి నర్మెట, తరిగొప్పుల మండలంతో పాటు హుస్నాబాద్ నుంచి కరీంనగర్ మీదుగా మహారాష్ట్రకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. భారీ వాహనాల కారణంగా తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డుకు గుంతలు పడటంతో అందులో వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికే రహదారి కోతకు గురికావడంతో పైపులు బయటకు కనిపిస్తున్నాయి. ఇటీవల మహారాష్ట్ర నుంచి వస్తున్న కారు వాగులో బోల్తా పడింది. ప్రయాణికులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. అలాగే మహారాష్ట్ర నుంచి ఏపీకి వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు వాగులోకి దూసుకెళ్లడంతో డ్రైవర్ ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకుని బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు.

బ్రిడ్జి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

అసంపూర్తి బ్రిడ్జి నిర్మాణంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. గ్రామాల నుంచి జనగామ పట్టణానికి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రావాల్సి వస్తోంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో రోడ్డు దెబ్బతింది. రహదారి కోతకు గురై ప్రమాదాలు జరుగుతున్నాయి. కలెక్టర్, ప్రజాప్రతినిధులు బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి.

– సౌద రమేశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

జనగామ నుంచి నర్మెట, తరిగొప్పుల, హుస్నాబాద్ వరకు వేల మంది ప్రయాణిస్తుంటారు. ఆర్టీసీ బస్సుల ద్వారా వివిధ గ్రామాల నుంచి విద్యార్థులు జనగామ పట్టణానికి ఉన్నత చదువులకు వస్తుంటారు. అలాగే పలువురు నిత్యం జనగామకు గ్రామాల నుంచి ద్విచక్రవాహలపై వ్యాపారాలు చేసేందుకు వస్తుంటారు. వారు అసంపూర్తి బ్రిడ్జితో నిత్యం ఇబ్బంది పడాల్సి వస్తోంది.

టీఎల్‌ఎంతో ఉత్తమ బోధన


పాలకుర్తి టౌన్: టీఎల్‌ఎం మేళాను తిలకిస్తున్న ఎంఈఓ నర్సయ్య తదితరులు

జనగామ రూరల్: టీఎల్‌ఎంతో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించవచ్చని ఏఎంఓ శ్రీనివాస్, ఎంఈఓ శంకర్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని స్థానిక అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం(బోధనాభ్యస సామగ్రి) మేళాను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులకు తక్కువ సమయంలో సులభంగా బోధించవచ్చని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కాంప్లెక్స్ హెచ్‌ఎంలు ఎం కనకయ్య, నిమ్మ వాసుదేవ రెడ్డి, బీటుకూరి శేషు కుమార్, సానికే సత్తయ్య, అల్లూరి రవీందర్ మర్యాల రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకుర్తి టౌన్: బోధనాభ్యాస సామగ్రి(టీఎల్‌ఎం) ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆసక్తి పెంపొందుతుందని, ఉపాధ్యాయులు తన ప్రతిభతో ఉత్తమ బోధన అందిచేందుకు ఉపయోగ పడుతుందని ఎంఈఓ పోతుగంటి నర్సయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో టీఎల్‌ఎం మండలస్థాయి మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, ఇంగ్లిష్, మ్యాథ్స్, పరిసరాల విజ్ఞానం నుంచి రెండు టీఎంఎల్‌లను జిల్లా స్థాయికి ఎంపిక చేశారు. తెలుగు ఉపాధ్యాయుడు దేవగిరి సూర్యప్రకాష్, బి.సుఖేందర్, ఆప్రోజ్ టబాసమ్, ఆష్రఫ్ సుల్తానా, రామానుజం, రాజుకుమార్, హేమలత, శ్రీగౌరి, అనులకుమారి, లలిత ఎంపికయ్యారు. ఈనెల 10న జిల్లా స్థాయిలో టీఎల్‌ఎం మేళాలో పాల్గొంటారు. కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పి.శోభారాణి, రమేష్, అంజయ్య, గిరిధర్, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్


హెల్త్ క్యాంపులో సుధీర్, వైద్యులు

స్టేషన్‌ఘన్‌పూర్: ప్రస్తుత వర్షాకాలంలో సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుధీర్ అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాలలో ఘన్‌పూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం హెల్త్‌క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ముందుగా పాఠశాల పరిసరాలు, వంటశాలలు, మరుగుదొడ్లు, మూత్రశాలలను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను, వంటశాలలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా పిల్లల్లో రక్తహీనతను గుర్తించడానికి 5వ తరగతి విద్యార్థులకు రక్తపరీక్షలు చేశారు. విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హస్నా, ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ అజయ్‌కుమార్, సీహెచ్‌ఓ వెంకటస్వామి, సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీలో..

దేవరుప్పుల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో శనివారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య పరీక్షలు చేసి అవసరార్థులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేకాధికారి సుకన్య, పీహెచ్‌సీ ఏఎన్‌ఎం వసంత, ఆశ వర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాస్తవాలను వక్రీకరిస్తున్నారు..

- సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు రాజారెడ్డి


మాట్లాడుతున్న రాజారెడ్డి

జనగామ రూరల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరిస్తున్న బీజేపీ గోబెల్స్ ప్రచారాన్ని ప్రతిఒక్కరూ ఖండించి వాస్తవాలను తెలుసుకోవాలని జనగామ మాజీ శాసనసభ్యుడు, సీపీఐ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు సిహెచ్ రాజారెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని గబ్బెట గోపాల్ రెడ్డి భవనంలో జీడీ ఎల్లయ్య అధ్యక్షతన పార్టీ జిల్లా సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో భూమి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం సాగిన తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణ త్యాగాలు, సాయుధ పోరుకు భయపడిన నాటి నైజాం ప్రభుత్వం 1947 సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనం చేశారన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలలో భాగంగా సెప్టెంబర్ 13న సాయిధ పోరాట యోధుడు, అమరవీరుడు నల్ల నరసింహులు విగ్రహం నుంచి ప్రచార జాత చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో పాతూరు సుగుణమ్మ, జిల్లా సహాయ కార్యదర్శులు ఆది సాయన్న, ఆకుల శ్రీనివాస్, సొప్పరి సోమయ్య, కావటి యాదగిరి, జువారి రమేశ్, విజయ పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులు, జర్నలిస్టుల పాత్ర కీలకం



రఘునాథపల్లి: సమాజంలో ఉపాధ్యాయులు, జర్నలిస్టుల పాత్ర కీలకమని హనుమకొండ రాణి రుద్రమ లయన్స్ ప్రెస్‌క్లబ్ రీజియన్ చైర్మన్ పొన్నాల సంయుక్త రాణి అన్నారు. శనివారం గోవర్ధనగిరి ఉన్నత పాఠశాల విద్యార్థులకు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్కూల్ బ్యాగులు, నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, పాత్రికేయులను సన్మానించి మాట్లాడారు. క్లబ్ అధ్యక్షుడు ఆర్.రోహిణి, వేణు, పారిశ్రామిక వేత్త పొన్నాల రామ్మోహన్, జోన్ చైర్మన్ కర్ణాకర్‌రెడ్డి, కార్యదర్శి నర్సింహారెడ్డి, హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు, పాత్రి కేయులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా విడుదల


ఓటరు లిస్టును ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ మమతాభాయ్

బచ్చన్నపేట: మండలంలోని అన్ని జీపీల ముసాయిదా ఓటరు జాబితాను విడుదల చేసినట్లు ఎంపీడీఓ మమతాభాయ్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని కార్యాలయంలో ఓటరు జాబితాలను విడుదల చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఆయా జీపీల్లో ఓటరు జాబితాలను ప్రదర్శనకు ఉంచాలన్నారు. అలాగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ–2025 ఎన్నికలకు సంబంధించి డ్రాఫ్ట్ ఓటర్ల, పోలింగ్‌స్టేషన్ల జాబితాపై రేపు(సోమవారం) చర్చించేందుకు రాజకీయ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు సమావేశానికి ఉదయం 11 గంటలకు హాజరుకావాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ వెంకటమల్లికార్జున్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ పంకజం, నితిన్, చక్రధర్ పాల్గొన్నారు.

రేపు రాజకీయ పార్టీలతో సమావేశం

కొడకండ్ల: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11.30 గంటలకు రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి తెలిపారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి


జెండా ఆవిష్కరణలో సీపీఎం నాయకులు

జనగామ రూరల్: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుల స్ఫూర్తితో ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పసరమడ్లలో గ్రామ పార్టీ ఆధ్వర్యంలో సాయుధ పోరాటంలో మృతిచెందిన అమరవీరులకు నివాళులర్పించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకుడు బోయిని సాములు జెండాను ఆవిష్కరించారు. అనంతరం కనకారెడ్డి మాట్లాడుతూ పోరాట యోధులను కన్న గ్రామానికి ప్రజలు రుణపడి ఉంటారని అన్నారు. మండల కమిటీ సభ్యులు తాండ్ర ఆనందం, బెజ్జరబోయిన మల్లేశం, గంధమల్ల యాదగిరి, బెజ్జబోయిన కృష్ణమూర్తి, రాములు, మేకల ప్రసాద్, మిద్దపాక యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జనగామ రూరల్: 2026–27 విద్యాసంవత్సరానికి ఉమ్మడి వరంగల్ జిల్లా పీఎంశ్రీ స్కూల్ జవహర్ నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.పూర్ణిమ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 23 తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని, ఎంపిక పరీక్ష 2026 ఫిబ్రవరి 7వ తేదీన ఉంటుందన్నారు. అభ్యర్థులు ఉమ్మడి వరంగల్ జిల్లా వారై ఉండాలన్నారు. దరఖాస్తులు ఎన్వీఎస్ వెబ్ సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అప్లై చేయాలని కోరారు.

అందుబాటులో యూరియా

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయ అధికారి విద్యాకర్‌రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పీఏసీఎస్ సొసైటీలో 33 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. అలాగే నేడు (ఆదివారం) మధ్యాహ్నం బాలాజీ ఫర్టిజర్‌కు, ఎస్‌పీ అగ్రిమాల్‌కు 10 టన్నుల చొప్పున యూరియా వస్తుందన్నారు. మొత్తం 53 టన్నుల యూరియా అందుబాటులో ఉంటుందని రైతులు తొందరపడకూడదన్నారు. ఏఈఓలు, రైతులు ఉన్నారు.

యూరియా పంపిణీ


లారీ నుంచి రైతులకు పంపిణీ చేస్తున్న యూరియా

దేవరుప్పుల: ఇటీవల యూరియా కొరత సమస్యతో రైతులు పడిగాపులు ఖాయడంతో లారీ లోడ్ రాగానే గోదాంలోకి దిగుమతి చేయనివ్వని దుస్థితులతో ఎరువుల దుకాణదారులు బాహాటంగా రైతుల చేతికి బస్తాలు అందజేయడం కొరత తీవ్రతకు అద్దం పడుతోంది. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో సుమారు 35 వేల ఎకరాల్లో పంటల సాగుకు గానూ వ్యవసాయ అధికారుల అంచనా మేరకు 2,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరంగా నిర్ధారించారు. ఆగస్టు మాసం లెక్కల మేరకు ఇప్పటికే 1,475 మెట్రిక్ టన్నుల యూరియా దేవరుప్పుల, సింగరాజుపల్లి, కోలుకొండ కూడలి కేంద్రాలుగా మార్క్‌ఫెడ్, ఇతర పద్ధతుల్లో సరఫరా చేశారు. ఈ విషయమై స్థానిక ఏఓ దివ్యను కదలించగా రాష్ట్రమంతటా యూరియా కొరత వదంతులతో ఆందోళన చెంది రైతులు మూకుమ్మడిగా నిత్యం యూరియా కోసం పాట్లు పడుతుండడంతో పారదర్శకతతో మండల వ్యవసాయ విస్తీర్ణాధికారుల సమక్షంలో ఆన్‌లైన్ విధానంలో దిగుమతిని బట్టి రెండు లేదా ఒక బస్తా చొప్పున పంపిణీ చేస్తున్నామన్నారు. సెప్టెంబర్ మాసానికి 360 నుంచి 400 మెట్రిక్ టన్నుల వరకూ యూరియా వస్తే పంటల సాగుకు సరిపోతుందన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం


పాలకుర్తి: బమ్మెరలో సన్మానం పొందిన టీచర్లు

సాక్షి నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో శనివారం ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగిన వినాయకుడి నిమజ్జనం

సాక్షి నెట్‌వర్క్: జిల్లాలోని పలు మండలాల్లో శనివారం కూడా వినాయక విగ్రహాల నిమజ్జనం కొనసాగింది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండపాల్లో నెలకొల్పిన గణనాథులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు(ఆదివారం) చంద్రగ్రహణం కావడంతో శోభాయాత్రగా వెళ్లి చెరువులు, కుంటల్లో గణపతి ప్రతిమలను నిమజ్జనం చేశారు.


జనగామ: పిల్లలతో కలెక్టర్, డీసీపీ, అధికారులు


జనగామ: పాతబీటు బజారు గణేష్ ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర


జనగామ: నెల్లుట్ల చెరువులో గణేశ్ నిమజ్జనం


చిల్పూరు: రాజవరంలో పూజలో పాల్గొన్న సబ్ పోస్టుమాస్టర్ వేణు దంపతులు తదితరులు


జనగామ: అంబేద్కర్‌నగర్‌లో ఊరేగింపు



జనగామ: జయశంకర్ కాలనీవాసుల శోభాయాత్ర

సంక్షిప్త సమాచారం

నీటి క్యాన్ల పంపిణీ

లింగాలఘణపురం: మండలంలోని మాణిక్యాపురానికి చెందిన బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరిపల్లి సతీష్ శనివారం గ్రామస్తులకు ఉచితంగా 300 నీటి క్యాన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్తులకు ఏదో సేవ చేయాలనే లక్ష్యంతో క్యాన్లను పంపిణీ చేస్తున్నానని భవిష్యత్‌లో కూడా ప్రజలకు మరింత సేవ చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయనను అభినందించారు.

క్రీడా దుస్తుల..



జఫర్‌గఢ్: మండలంలోని కూనూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత నాగమల్ల అశోక్ రూ.40 వేల విలువ చేసే క్రీడా దుస్తులను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం కాసర్ల సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు దాట అశోక్ క్రీడా దుస్తులను అందజేయడం అభినందనీయమన్నారు. ఎంఈఓ రఘునందన్‌రెడ్డి, హైస్కూల్ హెచ్‌ఎం పర్వేజ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

చిల్పూరు: యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ది ఆర్ట్ ఆఫ్ లివింగ్ ట్రైనర్ ఉప్పుల రవికుమార్ అన్నారు. చిన్నపెండ్యాల గ్రామంలోని బీసీ కాలనీలో శనివారం వివేక్ యూత్ ఆధ్వర్యంలో యోగా, ధ్యాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువకులు, చిన్నారులు, విద్యార్థులు పాల్గొని యోగా, ధ్యానం, ప్రాణాయామం చేశారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో పేరాల రాజమౌళి, ప్రతినిధులు మల్లేషం, నరసింహారెడ్డి, లక్ష్మణ్, యువకులు, చిన్నారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలప్యాకెట్ల విడుదల

చిల్పూరు: పల్లెపల్లెకు విజయ డెయిరీ పాల ఉత్పత్తుల్లో భాగంగా శనివారం కృష్ణాజీగూడెం గ్రామంలో పాల ఉత్పత్తుల సహకారసంఘం ఆధ్వర్యంలో పాల ప్యాకెట్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు సాదం రమేశ్ మాట్లాడుతూ కల్తీలేని పాలు, పెరుగు, పాలపదార్థాలు కేవలం విజయ డెయిరీలోనే అదుబాటులో ఉంటాయన్నారు. విజయ డెయిరీ ఉత్పత్తులనే వాడాలని కోరారు.

రైతుపై కోతుల దాడి

నర్మెట: వ్యవసాయ బావిద్ద చేనుకు కాపలా ఉన్న రైతుపై కోతులుదాడి చేసిన సంఘటన వెల్దండలో శనివారం చోటుచేసుకుంది. పంతంగి కుమార్ పత్తి చేనులోకి చొరబడిన కోతుల గుంపును వెళ్లగొడుతున్న క్రమంలో ఒక్కసారిగా అతనిపై దాడి చేశాయి. గమనించిన పొరుగు రైతులు కర్రలతో కోతులను వెళ్లగొట్టి కుమార్ కాపాడారు. అప్పటికే అతని శరీరంపై గాయాలు చేశాయి. వందల సంఖ్యలో కోతులు నిత్యం దాడిచేస్తున్నాయని అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవతీసుకుని వాటిని పట్టి అడవుల్లో వదిలేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బచ్చన్నపేట: మండల కేంద్రంలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో సదాశివపేట వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న గొల్లెన నరేష్ ట్రాక్టర్‌ను పట్టుకొని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

'స్వచ్ఛ విద్యాలయ రేటింగ్'లో ప్రశంసలు పొందాలి

జఫర్‌గఢ్: స్వచ్ఛ హేవం హరిత విద్యాలయ రేటింగ్‌లో హెచ్‌ఎంలు ప్రశంసలు పొందేలా పనిచేయాలని మండల విద్యాశాఖ అధికారి రఘునందన్‌రెడ్డి కోరారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కస్తూర్బా, మోడల్ స్కూల్, సాంఘిక గురుకుల పాఠశాలలతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్‌ఎంలకు స్వచ్ఛ హేవం హరిత విద్యాలయానికి సంబంధించిన 60 ప్రశ్నలకు సమాధానం చెప్పే అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్పీ కె.సుధాకర్ ప్రధానోపాధ్యాయులకు పలు అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సీఆర్పీలు బాబు, పుట్ట స్వామితో పాటు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

గణపతికి నీటి కష్టాలు


గుడి చెరువులో సగం మునిగిన గణపతి ప్రతిమలు

బచ్చన్నపేట: మండపాల్లో ప్రతిష్ఠించిన గణనాథులకు భక్తులు నవరాత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయా గ్రామాల చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. కానీ పలు గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నీరు లేకపోవడంతో వినాయక విగ్రహాలు మునుగలేదు. గత నాలుగేళ్ల క్రితం నిండిన మండల కేంద్రంలోని గుడి చెరువులో ప్రస్తుతం 5 శాతం నీరు కూడా లేదు. దీంతో అందులో వేసిన గణనాథుల విగ్రహాలు సగం మునిగి బయటకు కనిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని గోదావరి జలాలతో చెరువును నింపి తాగు, సాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలని అన్నదాతలు, ప్రజలు కోరుతున్నారు.

నివాళి

దేవరుప్పుల: మండలంలోని కడవెండికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు దరగాని రాములు తల్లి సోమక్క మృతి చెందింది. కాగా, శనివారం సోమక్క మృతదేహానికి బీఆర్‌ఎస్ మండల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. బస్వ మల్లేశం, చింత రవి, మహేష్ తదితరులు ఉన్నారు.